# చిన్నచిన్న బాటసారులు

ఆ రోజు పొద్దున్నే ఏమీ పని లేకపోవటంతో, హైద్రాబాద్‌లో ఎక్కడ పల్లెలో ఒంటరిగా కూర్చుని తెలుగు న్యూస్‌పేపరు చదువుతున్నాను. హైద్రాబాద్‌లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతున్నదిట. మరి మనుష్యులూ కార్లూ పెరుగుతున్నంత వేగంగా రోడ్లు వెడల్పు చేయటంలేదు. పెరగటంలేదు అనుకుంటాననుకుంటుంటే, ఆ విషయం లేకుండా అక్కడే వ్రాసి వుంది. హైద్రాబాద్ రోడ్డు ప్రమాదాల్లో ఎంతెమంది చచ్చిపోతున్నారో వ్రాశారు.

పక్క వాటాలో నుంచి ఎవరో కుర్రాడు అరుపొక్క రాగంలో ఏడుస్తున్నాడు. అమెరికాలో పొద్దున్నే ఒక కప్పు కాఫీ మాత్రమే త్రాగేవాడిని. కాని ఇండియాలో అలా కాదు. లేచి పళ్ళు తోముకోగానే ఒక కప్పు. మళ్ళీ బ్రేక్‌ఫాస్ట్‌తో ఇంకో కప్పు. సాయంత్రం ఏమీ పని లేకుండా కూర్చుంటే ఇంకో కప్పు. అయినా ఇండియన్ కాఫీలో, కొలంబియన్ కాఫీలో లేని సువాసన రుచీ వున్నాయి.

ఈ లోపల అక్కయ్య వేడి వేడి ఇడ్లీల ప్లేటు తీసుకువచ్చింది.

"బావగారిని కూడా రానీ" అన్నాను.

"కూరలు తేవటం కోసం వెళ్ళారు. ఇప్పుడే వస్తారు. నువ్వు కాని... ఇడ్లీలు చల్లారిపోతే బాగుండవు..."

"చల్లారిన ఇడ్లీలు నాకు బాగుండకపోతే, మరి బావగారికీ బాగుండవు కదా!" అంటాననుకుంటుంటే ఈ లోపల ఆయనే వచ్చారు కూరల సంచీతో. పక్క వాటాలో అబ్బాయి అరుపొక్క రాగం, గుక్క పట్టిన ఏడుపుగా మారి ఇంకా పెద్దదయింది. "ఎందుకో మరి అరగంటనించీ ఏడుస్తున్నాడు. మరీ చిన్న పిల్లాడేం కాదు కూడాను. ఆరేళ్ళవాడు!" అంది అక్కయ్య.

అల్పాహార పానాదులయ్యాక, స్నాన గానాదులు (అంటే బాత్రూంలో పాటలు) పూర్తి చేసుకుని తల దువ్వుకుంటున్నప్పుడు ఇంకా పక్క వాటాలోని ఆ కుర్రాడి ఏడుపు వినపడుతూనే వుంది. ఎందుకో పాపం ఏడుస్తున్నాడు ఏమయిందో అనుకుంటుంటే, ఆ అవసరం లేకుండా అక్కయ్యే అంది, "స్కూలుకి వెడదామని రోడ్డు క్రాస్ చేస్తుంటే, ఆ అబ్బాయి కాలు మీదనించీ ఆటో వెళ్ళింది. కాలు విరిగిపోయింది. ఒకటే రక్తం. అటు భరించలేని బాధ, ఇటు ఆ రక్తం చూసి భయం. ఒకటే ఏడుస్తున్నాడు. తడిగుడ్డ కడితే రక్తం ఆగిందిట. వాళ్ళ నాన్న రాగానే, హాస్పిటల్‌కి తీసుకువెడతారుటలే.." అంది అక్కయ్య.

"అయ్యో పాపం. ఆయనెప్పుడు వస్తాడో. ఏమన్నా సహాయం కావాలేమో! మనం వెడదామా" అనుకుంటుంటే ఒక్కసారిగా ఏడుపు ఆగిపోయింది. అప్పుడే లోపలికి వచ్చిన బావగారు అన్నారు- "హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారు ఇప్పుడే." అని

"మరి ఆ తర్వాత అతను.. అంత పెళ్ళు మూసుకుని ఈ కుర్రాడిని చూసు కోమందా.." అన్నాను.

"వాడెప్పుడో వెళ్ళిపోయాడు. ఇది అమెరికా కాదు నాయనా. ఎవరూ పట్టించుకోరు. నువ్వు చెప్పులు కొనుక్కోవాలన్నావ్ ఇక్కడే వుంది షాపు వెడ దామా" అన్నారు బావగారు.

"నువ్వెందుకు? ఇప్పుడే కదా వచ్చావ్. నాకు కొత్తేం కాదుగా! నేను వెడతాలే.." అని లేచి షూస్ వేసుకున్నాను. మెట్లు దిగి క్రిందికి వచ్చాను. టైమ్ పదకొండయిందేమో చిక్కడపల్లి మైన్‌రోడ్డు చాల బిజీగావుంది. దుమ్ము లేపుతూ వెడుతున్న కార్లు, లారీలూ, ఆటోలూ, స్కూటర్లూ, వాటన్నిటినీ మించి ఇసుక రాలని జనం. అసలే ఎక్కువ వెడల్పు లేని రోడ్డు. దానికి తోడు టూవే ట్రాఫిక్. అక్కడక్కడా జనం గుంపులుగా చేరి కబుర్లు చెప్పుకుంటూ ఆ సందట్లోనే సమారాధన చేస్తున్నారు. నేను నుంచున్న చోట, నాకు ఎదురుగా అవతలివేపున బావగారు చెప్పిన చెప్పుల షాపు. అంటే నేను ఆ ప్రవాహాన్ని తప్పించుకుంటూ అవతలివేపుకి వెళ్ళాలన్న మాట! పది నిమిషాలు అలాగే నుంచున్నాను ట్రాఫిక్ తగ్గుతుందేమోనని. తగ్గక పోగా అసలు తగ్గే సూచనలూ కనపడలేదు. ఇండియాలో ఎన్నో సంవత్సరాలు మోటర్ సైకిల్ నడిపినా అదెప్పుడో పాతికేళ్ళ క్రితం కనుక ధైర్యం చాలక ఇప్పుడు స్కూటర్లూ మోటర్ సైకిళ్ళూ నడపటం మానేశాను. గుంటూరూ గుడివాడలో అయితే నడపటమే బాగుండేది. ఇక్కడ అదీ కుదిరేట్టు లేదు. ఎస్వీరంగారావు చెప్పినట్టు, సాహసం చేయరా ఢింభకా అని రోడ్డు దాటటం ప్రారంభించాను. చిన్నప్పుడు మా పిల్లలు కంప్యూటర్లో ఆడుకునే ఆట గుర్తుకొచ్చింది. దాని పేరు ఫ్రాగ్ అనో ఏదో అనేవారు. రోడ్డు మీద వెళ్ళే కార్ల క్రింద పడకుండా ఒక కప్ప తప్పించుకుంటూ రోడ్డు దాటటమన్నమాట. కొంచెం ముందుకి వెళ్ళటం, ఈ లోగా ఏ కారో దూసుకురావటం. దాంతో మళ్ళీ రెండడుగులు వెనక్కివేయటం. ఇలా రోడ్డు దాటటానికి చాలసేపు పట్టింది.

మెడ దగ్గర చెమట తుడుచుకుంటూ చెప్పుల షాపులోకి వెళ్ళాను. అమెరికాలో కలలో కూడా ఊహించని ధరకి దొరికాయి చక్కటి చెప్పులు. అవి వేసుకుని నా షూస్ పేక్ చేయించుకుని బయటికి వచ్చాను. ట్రాఫిక్ ఏమాత్రం తగ్గక పోగా, భోజన సమయం కనుక ఇంకా పెరిగినట్టుంది. మళ్ళీ అదే పద్ధతిలో కప్ప దాటులు వేసుకుంటూ, ఆటోలనీ కార్లనీ తప్పించుకుంటూ ఇవతలి పక్కకి వచ్చే సరికి చాలసేపు అయింది. నా "కష్టానికి" ఫలితం దక్కినందుకు విజయగర్వంతో ముందుకి నడుస్తున్నాను.

వెనక నుంచి నా చేయి పట్టుకుని ఎవరో అంటున్నారు "అంకుల్!" అని.

వెనక్కి తిరిగి చూశాను. ఒక ఆరేళ్ళ కుర్రాడు. తెలుపూ నీలం రంగుల స్కూల్ యూనిఫాం వేసుకుని, ఐదు కేజీల పుస్తకాలు నింపిన బ్యాక్ పేక్ వీపుకి తగిలించుకుని నా వేపే నిస్సహాయంగా చూస్తున్నాడు.

"అంకుల్ కొంచెం హెల్ప్ చేస్తారా? రోడ్డు దాటాలంటే కుదరటం లేదు" అడిగాడు. అతని తెల్లని లేత ముఖంలో కొంచెం కంగారు, భయం కనపడుతూనే వున్నాయి. పెద్దవాడిని నాకే రోడ్డు దాటటం కష్టమయింది. పసి వెధవ. అతను కంగారు పడటంతో ఆశ్చర్యమేముంది.

"రోజూ నా పక్కనే మా అక్క వుండేది రోడ్డు దాటటానికి. ఇవాళ అది స్కూలికి రాలేదు" అన్నాడు, నా సహాయం ఎందుకు అవసరమయిందో విపులీకరిస్తూ. నాకు వెంటనే పక్కింటి అబ్బాయి కాలు మీదనించీ ఆటో వెళ్ళటం అతను బాధ పడుతూ పెద్దగా ఏడవటం గుర్తుకి వచ్చింది.

అతని వేపు చూసి పలకరింపుగా చిన్నగా నవ్వి, అతని చేయి పట్టుకుని నెమ్మదిగా మళ్ళీ రోడ్డు దాటటం ప్రారంభించాను. పక్కన ఆ కుర్రాడు కూడా వుండటంతో, అవతలికి వెళ్ళటానికి సమయం కొంచెం ఎక్కువే పట్టింది. అటునించీ మళ్ళీ వెనక్కి రావటమింకో యజ్ఞం. నేను చేసిందొక సహాయం కాదు. ఎవరైనా చేస్తారు. కానీ ఇలా ఎందుకు జరుగుతున్నది? ఇలా జరగకుండా ప్రజలు కానీ ప్రభుత్వం కానీ ఏం చేస్తున్నట్టు? అదే నా ఆలోచనలని తొలిచేస్తున్నది.

ఇలాటి బిజీ రోడ్లు దాటటం ప్రమాదకరం. అందులోనూ చిన్న పిల్లలు. మిత్రులు కవనశర్మగారన్నట్టు వాళ్ళు చిన్న చిన్న బాటసారులు. వాళ్ళని సరైన బాటలో నడిపించవలసిన పెద్దవాళ్ళు, కార్లలోనూ ఆటోలలోనూ వెడుతూ వాళ్ళకలా ప్రాణాపాయం కలిగిస్తుంటే ఎలా? అమెరికాలో జనం తక్కువయినా కార్లు చాల ఎక్కువ. జనం నడిచే చోట, వాళ్ళ పరిరక్షణకోసం ఎన్నో రూల్సున్నాయి. ఉదాహరణకి నడవటానికి సిగ్నల్ రావటం, నడిచేవాళ్ళని చూసి కార్లు ఆపటం మొదలైనవి.

ఇంటికి రాగానే బావగారు అంటున్నారు నవ్వుతూ "నువ్వు ఎంతసేపటికీ రాకపోతే తప్పిపోయావేమోనని భయపడుతున్నది మీ అక్కయ్య" అని.

నేనూ నవ్వి ఊరుకున్నాను. రోడ్డు దాటటం కష్టమయిందంటే నవ్వుతారేమోనని.

పక్క వాటానించీ కుర్రాడి ఏడుపు వినపడటం లేదు. నొప్పి తగ్గటానికి ఏవో మందులు ఇచ్చి వుంటాడు డాక్టర్.

అక్కయ్య అంది – "ఆయన ఇప్పుడే హాస్పిటల్‌నించీ ఫోన్ చేశాడుట. ఎముక విరిగిందేమోనని అనుమానంగా వుందిట. ఎక్స్‌రే తీస్తే కానీ ఏమీ చెప్పలేమన్నారుట' పాపం. నొప్పితోనూ భయంతోనూ వాడు ఒకటే ఏడుస్తున్నాడు"

అవును. ఆరేళ్ళ కుర్రాడు మరి.

అతనూ, అతనిలాటి వాళ్ళూ నేటి చిన్న చిన్న బాటసారులే కాదు. రేపటి పౌరులు కూడాను.

రేపటి వర్తమానం వాళ్ళ చేతుల్లో వుంటే, ఈనాటి వాళ్ళ భవిష్యత్తు మన చేతుల్లో లేదూ?

* * *